మెహిదీపట్నం ఆర్టీసీ డిపో తనిఖీ

హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సుధా పరిమళ మహిదీపట్నం డిపోను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్ సెక్షన్, గ్యారేజ్ సెక్షన్, ఆఫీస్ లను పరిశీలించారు. తదుపరి డ్రైవర్, కండక్టర్, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బీవీ కృష్ణమూర్తి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సరస్వతి, అసిస్టెంట్ ఇంజినీర్ రహమాన్, ఆఫీస్ సూపరిండెంట్ కొండలరావు పాల్గొన్నారు. – మెహిదీపట్నం, మే31

ముగిసిన భగవద్గీత శిక్షణ శిబిరం

లంగర్‌హౌస్ డివిజన్ శ్రీ వివేకానంద సేవాసమితి భగవద్గీత వేసవి వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకుశ్రీ సరస్వతీ శిశు మందిర్ గీతా భవనంలో ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్వహిందూ పరిషత్ తెలంగాణ మాజీ అధ్యక్షులు రామ రాజు, శ్రీ సరస్వతి శిశు మందిర్ లంగర్‌హౌస్ అధ్యక్షులు దూసరి శ్రీధర్‌గౌడ్, ఆర్‌ఎస్ఎస్ పూర్వప్రచారకులు శ్రీనివాస రాజు లు పాల్గొన్నారు. ప్రతిభ చూపించిన వారికి బహుమతులు, పాల్గొన్న సాధకులకు ప్రశంసా పత్రం అందజేశారు. – మెహిదీపట్నం, మే 31

డోలక్ కృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం

కృష్ణ సతీమణి భారతికి చెక్కులు అందజేస్తున్న రాష్ట్ర కురుమ సంఘం నాయకులు

జియాగూడ, మే 31 : తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం నాయకులు డోలక్ కృష్ణ (73) మృతి చెందడం బాధాకరమని కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, సెక్రెటరీ కొలుపుల నరసింహ, జంట నగరాల కురుమ సంఘం అధ్యక్షుడు నర్స వినోద్ కుమార్, కే బుచ్చయ్య లు పేర్కొన్నారు. శనివారం జియాగూడలోని కృష్ణ నివాసంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం ఆదేశాల మేరకు సంఘం తరపున, ఆయన అంత్యక్రియలకు రూ. 25 వేలు, దశదినకర్మకు రూ.50 వేలు ఆర్థిక సాయం చెక్కును డోలక్ కృష్ణ సతీమణి భారతికి, కొడుకులు, ఉల్వే శ్రీనివాస్, ఉల్వే, శ్రీధర్, కూతుర్లు, జి, సంగీత, జి జ్యోతిలకు అందజేశారు. జియాగూడ కురుమ సంఘం అధ్యక్షుడు కోరే రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవర మహేశ్, డి. ఈశ్వరయ్య, దేవర, శివశంకర్, గంగాల హనుమంతరావు, కాలే అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడు నెలల రేషన్ పంపిణీ

జంట నగరాల ప్రధాన రొటేషనింగ్ అధికారి కార్యాలయం

- దుకాణాలలో అందుబాటులో సరుకులు
- డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు
- జూన్ 30వరకు సరుకుల పంపిణీ
- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేశ్

అబిడ్స్, మే 31: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆహార భద్రత కార్డుదారులకు మూడు నెలల రేషన్ సరుకులను జూన్ మాసంలో పంపిణీ చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఒకటవ తేదీ నుంచి సరుకులను పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జంట నగరాలలో జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం, గోధుమలు, పంచదార జూన్ మాసంలోనే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా సరుకుల కోటాను అధికారులు రేషన్ దుకాణాలకు తరలించారు. నగరంలోని వివిధ గోడౌన్‌లో ఉన్న సరుకులను జంట నగరాలలోని 653 రేషన్ దుకాణాలకు సరుకులను తరలించారు. మూడు నెలలకు సంబంధించిన 45 వేల 259.677 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం, ఆరు లక్షల 47 వేల 282 ఆహార భద్రత కార్డుదారుల లోని 24,24,824 సభ్యులకు సరుకులను సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఈ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 30వ తేదీ వరకు కొనసాగించేందుకుగాను అధికారులు రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

పంపిణీలో అవకతవకలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ..

సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కార్డుదారులు సరుకులను ఇతరులకు అమ్మినా.. అమ్మితే ఎవరైనా కొనుగోలు చేసినా.. చట్టరీత్యా నేరమని అటువంటి వారి రేషన్ కార్డును రద్దు చేయడంతో పాటు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జంట నగరాల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ రమేష్ హెచ్చరించారు. సరుకుల పంపిణీ పారదర్శకంగా ఉండేందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.

అదేవిధంగా నగరంలోని అత్యధిక రేషన్ దుకాణాలలో నెలకు సరిపడా సరుకులను నిలువ చేసుకునే అవకాశం ఉన్నటువంటి దుకాణదారులు జూన్ మాసం కోసం అదనపు షట్టర్లలో స్టాక్ నిలువ చేసుకునేందుకు అధికారులు అనుమతించారు.

అందుబాటులోకి సరుకుల నిల్వలు..

జంట నగరాలలోని ఆహార భద్రత కార్డుదారులకు మూడు నెలల సరుకుల పంపిణీకు గాను అధికారులు సరుకులను దుకాణాలకు తరలించారు. ఆయా కోటాలను రేషన్ దుకాణదారులు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల సరుకులను ఆదివారం నుంచి పంపిణీ ప్రారంభించనుండగా శనివారం నాటికి సరుకులను చేర వేశారు. ఈ విషయమై ఇప్పటికే అధికారులు సర్కిల్లో వారిగా రేషన్ దుకాణదారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సరుకుల పంపిణీలో డీలర్లకు ఎదురయ్యే సాధక బాధకాలను తెలుసుకొని వారికి పలు సూచనలు సలహాలు చేశారు.

సరుకుల పంపిణీ సజావుగా సాగేలా చర్యలు

మూడు నెలల రేషన్ సరుకులను కార్డుదారులకు పంపిణీ సజావుగా సాగేందుకు అ వసరమై న అన్ని ఏర్పాట్లు చేపట్టాం. జంట నగరాలలోని తొమ్మిది సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఉన్న ప్రతి సభ్యునికి ఆరు కిలోల బియ్యం చొప్పున మూడు నెలలకు 18 కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తారు. అదే విధంగా ప్రతి కార్డుకు 5 కిలోల గోధుమలు మూడు నెలలకు 15కిలోలు పంపిణీ చేస్తారు. అంత్యోదయ కార్డుదారులకు నెలకు 35 కిలోల చొప్పున మూడు నెలలకు మొత్తం 105 కిలోల బియ్యం, అన్నపూర్ణ కారుదారులకు 10 కిలోల చొప్పున మూడు నెలలకు 30 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తారు. ఆదివారం నుంచి 30వ తేదీ వర కు ఈ సరుకుల పంపిణీ జరుగుతుంది. కార్డుదారులు ఏ రేషన్ షాపులోనైనా రేషన్ పొందడానికి వీలుంటుంది.

– ఏ రమేశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీలో విద్యార్థులు

అబిడ్స్ మే 31: పొగాకు శరీరానికి విషంతో సమానమని అయినప్పటికీ ప్రజలు ప్రత్యేకించి విద్యార్థులు, యువకులు దానికి బాగా అలవాటు పడి వ్యసనంగా మార్చుకుంటున్నారని ఓల్డ్ సిటీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ఉమేష్‌గౌడ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు సేవించడం వల్ల వచ్చే అనర్థాలపై పూల్‌బాగ్ చమన్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పొగ తాగే వారితో పాటు పక్క నుండి పొగపీలిచేవారు కూడా అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ తరపున విద్యార్థులు, యువకులు ప్లకార్డులను చేతబట్టి పొగాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీని నిర్వహించారు. ఎం. కిరణ్ చారి, బి. శేఖర్, సురేందర్, ఈ. గిరీశ్ బాబు, శశిధర్‌చారి, బి. వెంకటేశ్, పి. విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీకోచ్‌లు ప్రదీప్, ప్రతాప్, రాజప్రభు, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ దూసరి లావణ్యాగౌడ్ తెలిపారు. డివిజన్‌లోని తులసీరాంనగర్ లంకలో కొన్ని రోజులుగా బడ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం కార్పొరేటర్ సమస్యను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. బస్తీ వాసులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. – గోల్నాక, మే 31

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

తిరుమలనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మే 31: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం గోల్నాక డివిజన్ తిరుమలనగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యాశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మంచినీటి, వరదనీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులను ముమ్మరంగా చేపడుతున్నామని ఆయన తెలిపారు. అనంతరం కాలనీల్లో క్షేత్రస్థాయిలో పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

సర్కిల్–14 డీసీ లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, మే 31: గోషామహల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఏం ఆనంద్‌కుమార్‌గౌడ్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన జీహెచ్ఎంసీ సర్కిల్–14 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్యను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో నాలా, కచ్చా మోరీల పూడికతీత పనులు వెంటనే చేపట్టి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నియోజకవర్గంలో వర్షం పడితే రోడ్లు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై కుంటలు చెరువులను తలపిస్తాయన్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు నాలా, కచ్చా మోరీల పూడికతీత పనులు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మూడు నెలలుగా అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడం లేదని డీసీకి తెలిపారు. విజయ మార్కెట్ విక్రాతి థియేటర్ వద్ద గతంలో ఏర్పాటు చేసిన సులబ్ కాంప్లెక్స్‌ను అక్రమంగా కూల్చి వేశారని, వెంటనే కూల్చేసిన సులభ్ కాంప్లెక్స్ స్థానంలో మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఉన్నత అధికారులను ప్రశ్నిస్తే సిబ్బంది లేరని అంటున్నారని, సిబ్బంది లేక పోతే సర్కిల్ టౌన్ ప్లానింగ్ కార్యాలయానికి టులెట్ బోర్డ్ ఏర్పాటు చేయాలని ఆయన ఎద్దేవా చేశారు. నాయకులు మొహమ్మద్, సుమన్, విజయ్ ముదిరాజ్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరినాథ్‌గౌడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

హరినాథ్‌గౌడ్‌కు అవార్డును అందజేస్తున్న వేణుగోపాల్

అబిడ్స్, మే 31 : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ముఖ్య కో ఆర్డినేటర్ జీ. వేణుగోపాల్ అన్నారు. ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పండల హరినాథ్‌గౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు శ్రీ కాశమాని షాంరావ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఎనలేని కృషిచేసి ఎన్నో ప్రశంసలు అందుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్ పంపిన ఒక సందేశంలో హరినాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరినాథ్‌గౌడ్ కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు 20 25 ను అంద జేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పవన్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు గాంధీ ఆసుపత్రి బయో కెమిస్ట్ మాచర్ల రవీందర్, కొత్త మనోహర్ ముదిరాజ్, మానిక్ రావ్, కిష్టయ్య, సరూర్నగర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని హరినాత్‌కు పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, మే 31: గోషామహల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు గాను నిధులు విడుదల చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వినతిపత్రం సమర్పించారు. సచివాలయంలో జరిగిన అభివృద్ధి సమీక్ష సమావేశంలో వినతిపత్రం సమర్పించిన అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ బేగం బజార్, సిద్ధంబర్ బజార్, బేగం బజార్ ఛత్రి తదితర ప్రాంతాలలో రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలని కోరారు. అదే విధంగా బోయగూడా కమాన్ నుంచి మంగళాట్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు పనులను పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోఠిలో ఉన్న చాకలి ఐలమ్మ మహిళ యూనివర్సిటీ వద్ద విద్యార్థినులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మంగళహాట్ మార్కెట్ను మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దాలని ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మెట్టు సాయికుమార్ తన వినతి పత్రంలో కోరారు.

మంత్రి పొన్నం ను కలిసిన బోనాల కమిటీ సభ్యులు

చార్మినార్, మే 31: హైదరాబాద్ నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ను పాతనగర మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు అయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను వైభవంగా జరుపుటకు ప్రభుత్వం తరపున అని ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి భరోసా ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు జి.రాఘవేందర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గోల్కొండ బోనాల ఉత్సవ సమితి

మెహిదీపట్నం, మే 31 : ఆషాఢ మాసం బోనాల గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయం అమ్మవారి ట్రస్ట్ కమిటీ చైర్మన్‌గా కొండేపూడి చంటిబాబును దేవాదాయ శాఖ నియమించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, కార్వన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్‌అలీ అజీరీలకు చంటిబాబు ధన్యవాదాలు తెలిపారు. శనివారం బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబుతోపాటు సభ్యులు కలిశారు.

మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు పట్టివేత

చార్మినార్, మే 31: అక్రమంగా మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్‌లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ పరిధిలోని మహమ్మద్ నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ జిబ్రాన్ అన్సారీ (30) స్థానికంగా వెల్డింగ్ వర్కర్. చేస్తున్న వర్కులో వచ్చే ఆదాయంతో తృప్తిచెందక శరీరక అలసటను దూరం చేసే అధిక డిమాండ్ ఉన్న ఇంజెక్షన్‌లను విక్రయించాలని ప్లాన్ వేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో హర్యానా రాష్ట్రానికి చెందిన సాహెంద్ర ప్రసాద్ నుంచి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా నగరానికి మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్‌లను తెప్పించి నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అన్సా రీ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా..రూ. లక్ష రూ.25వేల విలువ కలిగిన మెఫెంటెర్మిన్ సల్ఫేట్ ఇంజెక్షన్‌ల పట్టు బడ్డాయి. దీంతో పాటు యాక్టీవా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమ్మిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించారు. ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, ఎస్ఐ కవి ఉద్దీన్, సాయిరాం, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిషేధిత ఈ సిగరెట్లు పట్టివేత

ముగ్గురు నిందితులు అరెస్ట్

చార్మినార్, మే 31: నిషేధిత ఈ సిగరెట్ అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురు సభ్యులను సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇద్రీస్, మల్లేపల్లికి చెందిన అమీర్ ఖాన్, సంతోష్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ అసద్‌లు.. తమకు వచ్చే ఆదాయంతో తృప్తిచెందక అధిక మొత్తంలో సంపాదించాలని ప్లాన్ వేసుకున్నారు. అందులో భాగంగా ఢిల్లీకి చెందిన షాకీర్ నుంచి ఆన్‌లైన్‌లో సంప్రదిస్తూ ఈ సిగరెట్‌లను ట్రాన్స్‌పోర్టు ద్వారా దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. శనివారం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఢిల్లీ నుంచి వచ్చిన ఈ సిగరెట్‌లను తీసుకోవడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి వివిధ బ్రాండ్‌ల పేరు కలిగిన సుమారు రూ.6లక్షల విలువైన ఈ సిగరెట్‌లను, 2 ద్విచక్ర వాహనాలను,3 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమ్మిత్తం ఐఎస్ సదన్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ప్రశాంత్, కవి ఉద్దీన్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

కింగ్ కోఠి జిల్లా దవఖాన సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌ను సన్మానిస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

సుల్తాన్ బజార్, మే 31: కోవిడ్ సమయంలో కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అభినంద నీయమని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ దావఖాన సూపరింటెండెంట్, హైదరాబాద్ జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను శాలువాతో కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సంతోష్ బాబు, జిల్లా నూతన డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్య శ్రీ, ఆర్ ఎం.ఓ. డాక్టర్ సాధన, నాంపల్లి ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చంద్రారెడ్డి, మాజీ సూపరింటెండెంట్ సునీత, హైదరాబాద్ జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని, వైద్యులు డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యులు, నర్సింగ్ సూపర్డెంట్ సమంతకమని మరియా, వివిధ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

జూపల్లి నర్సింగరావు ఉద్యోగ విరమణ

సుల్తాన్‌బజార్, మే 31:జిల్లా విద్యాశాఖ తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ జూపల్లి నర్సింగరావు ఉద్యోగ విరమ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆబిడ్స్ లోని స్టాండ్లీ స్కూల్ బిషప్ చిదంబరం హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్, కోశాధికారి ప్రేమ్, ఉపాధ్యక్షుడు ఎం. రవి, జాయింట్ సెక్రెటరీ జయంతిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రియ తదితరులు జూపల్లి నర్సింగరావు దంపతులను సత్కరించారు.

సంస్కృతి సంప్రదాయాలకు మూలం హిందూ మతం

డైరెక్టర్ డా.సౌమ్య మిశ్రా, దైవజ్ఞశర్మ, శ్రీవాణి, రఘు శ్రీ, ఆకాంక్ష చారిటిబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యా రాణి పాల్గొన్నారు. – రవీంద్రభారతి, మే 31

సంస్కృతి సాంప్రదాయాలకు మూలం హిందూ మతమని సినీనటుడు డాక్టర్ సుమన్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, శ్రీఆకాంక్ష చారిటిబుల్‌ట్రస్ట్ నిర్వహణలో జానపద సంగీత గురువు పద్మజా విస్ సమర్పించిన జనపదం సంగీత కార్యక్రమం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది.యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా సినీ హీరో సుమన్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సంగీత కళాకారులకు సన్మానించారు. ఈ సందర్భంగా జానపద సంగీత గురువు పద్మజావిశ్వాస్‌ను సత్కరించి నవకళ తరంగిణి బిరుదు ప్రదానం చేశారు. జైళ్ల శాఖ

అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగ విరమణ

వాణిజ్య పనుల శాఖ చార్మినార్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ డి చంద్రమోహన్ ఉద్యోగ విరమణ సందర్భంగా అధికారులు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి వీడ్కోలు పలికారు. చార్మినార్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెహిదీపట్నం సర్కిల్ వన్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం చార్మినార్ జాయింట్ కమిషనర్ కార్యాలయం స్టేట్ టాక్స్ ఆఫీసర్ జగన్ మోహన్ రావు, అసిస్టెంట్ కమిషనర్లు క్రాంతి, సంధ్యారాణి ఆయనకు పుష్పగుచ్చాలను అందించి వీడ్కోలు పలికారు. – అబిడ్స్, మే 31

సెవెన్ టూంబ్స్.. అభివృద్ధికి రూ. 75 కోట్లు మంజూరు

గోల్కొండ కోట, కటోర హౌస్, సెవెన్ టూంబ్స్ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపడానికి హెచ్ఎండీఏ నుంచి రూ. 75 కోట్ల నిధులను మంజూరు చేశారు. శనివారం హెచ్ఎండీఏ అధికారులతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ సమావేశమయ్యారు. దీనికోసం అభివృద్ధి పనులను ఎలా చేపట్టాలనే విషయంపై చర్చించారు. – మెహిదీపట్నం, మే 31

రాష్ట్ర కబడ్డీ సభ్యులు జగదీశ్‌యాదవ్, శ్రీరాములుపై కేసు నమోదు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 31 : తెలంగాణ రాష్ట్ర కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి జి.జగదీశ్‌యాదవ్, కోశాధికారి కె.బి.శ్రీరాములు అనధికారికంగా అవినితికి పాల్పడినట్టు మాజీ సంయుక్త కార్యదర్శి, జాతీయ కబడ్డీ క్రీడాకారులు తోట సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆబిడ్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సెక్షన్ 316 (2), 318(4) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శిగా 2020 నుంచి 2024 వరకు బాధ్యతలు నిర్వర్తించానని సురేష్ పేర్కొన్నారు. అంతర్ జిల్లా కబడ్డీ పోటీల నిర్వహణకు ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధుల నుంచి జిల్లా కమిటీలకు ఇవ్వకుండా వీరిద్దరూ అవినీతికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులను స్వంత ఖర్చులకు వాడుకోవడం జరిగినట్టు ఆధారాలున్నాయన్నారు. తెలంగాణ కబడ్డీ సంఘానికి ఒకే బ్యాంక్ ఖాతా ఉన్నదని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులను నమ్మించి ప్రభుత్వ నిధులను దారిమళ్లించి సంఘాన్ని మోసం చేశారని వివరించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఖైరతాబాద్ శాఖలో వీరిద్దరు కలిసి అనధికారికంగా మరొక ఖాతా తెరిచినట్టు తెలిపారు. ప్రభుత్వం, దాతలిచ్చిన నిధులను అనధికారికంగా రూ.60లక్షలు మరొక ఖాతానుంచి విత్‌డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. 2021లో సూర్యపేటలో నిర్వహించిన జిల్లా జూనియర్ జాతీయ కబడ్డీ పోటీల నిర్వహణ కోసం రూ.కోటి 20లక్షల నిధులనుంచి రూ. 50లక్షలు రెండో ఖాతా నుంచి విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీల నిర్వహణ కోసం చింతల స్పోర్ట్స్ ద్వారా అందించిన రూ.20లక్షలను సొంత ఖర్చులకు వాడుకున్నట్టు తెలిపారు. తెలంగాణ ఒలింపిక్ సంఘానికి కార్యదర్శిగా ఉన్న సమయంలో జగదీష్‌పై సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో కూడా కేసు నమోదైనదని తెలిపారు. అవినీతి గురించి వారిద్దరిని ప్రశ్నించినందుకు తనను బెదిరింపులకు గురిచేశారని, కక్షపూరితంగా మహబూబాబాద్ జిల్లా కబడ్డీ సంఘం నుంచి తనను తొలగించారని వివరించారు. వీరిద్దరి గురించి అధికారులకు తెలియజేసినప్పటికీ చర్యలు చేపట్టలేదని తెలిపారు.

సింగరేణి డిస్మిస్ కార్మికుడు జీకే సంపత్‌ను అరెస్టు చేయాలి

రవీంద్రభారతి,మే 31 : సింగరేణిలో అవినీతి ఆరోపణలపై తొలగించబడిన కార్మికుడు జీకే సంపత్‌కుమార్ మెడికల్ బెన్‌ఫిట్లు, బదీలీల పేరుతో అమాయక కార్మికుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నాడని అతని వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కోట శివశంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, తెలంగాణ ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థి యువజన సంఘం నేతలు జ.రమేశ్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, కోట శివశంకర్ మాట్లాడుతూ సింగరేణిలో ఒక క్లర్కుగా ఉద్యోగంలో చేరిన జీకే సంపత్‌కుమార్ అవినీతి పై విజిలెన్స్ విచారణ జరిపించి ఆధారాలతో అతని అవినీతిని అప్పటి సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీకే సంపత్‌కుమార్‌ను సింగరేణి సంస్థ నుంచి తొలగించారని చెప్పారు. ఉద్యోగం నుంచి తొలగించినప్పటికీ సింగరేణిపై పెత్తనం చెలాయిస్తూ అమాకుల వద్ద కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారని, తక్షణమే జీకే సంపత్‌కుమార్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్సీ,ఎస్టీ,బీసీ ఉద్యోగులు, నిరుద్యోగుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.